క్లుప్తంగా

దోమల వృద్ధితో జ్వరాలు



సంజయ్‌గాంధీ కాలనీ వద్ద నిల్వ నీటిని పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

ఆరిలోవ : వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందుతాయని, వాటితో జాగ్రత్తగా ఉండాలని జోన్ – 2 జెడ్సీ కె.కనకమహాలక్ష్మి సూచించారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి కొండవాలు ప్రాంతాలు క్రాంతినగర్, సంజయ్‌గాంధీకాలనీ, ప్రశాంతినగర్‌లో సోమవారం ఆమె పర్యటించారు. ఇళ్ల ముందు పూల కుండీలు, ఖాళీ డబ్బాలు పరిశీలించారు. ఖాళీ డబ్బాల్లో నిల్వ ఉన్న వర్షం నీటిని పరిశీలించారు. అందులో దోమల లార్వా వృద్ధి చెందుతుందని, దానివల్ల దోమలు పెరిగి జ్వరాలు ప్రబలుతాయని ఆమె సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమెతోపాటు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని 19వ వార్డు వాసవానిపాలెంకు చెందిన బడ్డి రాములు (74) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాములు వాసవానిపాలెంలో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. ఈ నెల 6న సాయంత్రం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లభించలేదు. దీంతో రాములు భార్య బడ్డి రాజులమ్మ సోమవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని హెచ్‌సీ దుర్గారావు కోరారు.

13 నుంచి డ్యాన్స్ పోటీలు

మద్దిలపాలెం : దసరా పండగను పురస్కరించుకుని ఈ నెల 13, 14న విశాఖ జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్.జానకి తెలిపారు. సీతమ్మధారలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న ఏపీఎస్ఈబీ కాలనీ సమావేశ మందిరంలో 13న ఉదయం శాస్త్రీయ, జానపద సోలో, డ్యూయేట్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 13 సంవత్సరాల్లోపు వారిని జూనియర్స్‌గా, 14 నుంచి 18 ఏళ్లలోపు వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామని తెలిపారు. రెండు విభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 11లోగా 8522990123లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కొండవాలులో నిర్మాణాలు కష్టం



కాంక్రీట్ డేలో పాల్గొన్న సాయి, తదితరులు

మద్దిలపాలెం : భారతీయ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ వైజాగ్ సెంటర్, ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా కాంక్రీట్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రైల్వేస్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ అంకాల సాయి బాలా ప్రపంచంలో ఎత్తైన మణిపూర్‌లోని రైల్వే పిల్లర్ బ్రిడ్జి నోనీ బ్రిడ్జి రూపకల్పన, నిర్మాణం, నిర్వహణపై ప్రసంగించారు. ఈ వంతెన జిరిబామ్ – ఇంఫాల్ రైల్వే లైన్ ప్రాజెక్టులో ముఖ్య భాగమన్నారు. ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంతోపాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని పెంపొందించడానికి 141 మీటర్ల ఎత్తులో బ్రిడ్జి నిర్మించారన్నారు. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో వచ్చే గాలులను తట్టుకునేలా రూపొందించారని తెలిపారు. చల్లని వాతావరణ పరిస్థితుల్లో కాంక్రీట్ పనులు, కొండవాలులో పిల్లర్లకు పునాదుల నిర్మాణం చాలా కష్టమన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన విషయాలు తెలియజేశారన్నారు. అనంతరం ఐసీఐ వైజాగ్ సెంటర్ చైర్మన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రసంగించారు.

వాహనం ప్రారంభం

మహారాణిపేట : అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రాలకు దివ్యాంగులను తరలించడానికి కొత్త వాహనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. దివ్యాంగులను చికిత్స కోసం ఉచితంగా తరలించడానికి వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన వాహనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ హారిక, బి.నాగేశ్వరరావు, డాక్టర్ కె.అప్పారావు, శాంతి ప్రియ పాల్గొన్నారు.

రేషన్ డిపోకి వెళ్లాలా... సచివాలయానికా..!

కూటమి పాలకుల స్మార్ట్ గందరగోళం

- రేషన్‌కార్డులు ఎక్కడ తీసుకోవాలో తెలియక కార్డుదారుల ఆందోళన
- ఇంటి వద్దనే అందజేస్తామని నాయకులు, అధికారుల ప్రకటన
- ఆ సంగతే మరిచిపోయిన పాలకులు, సచివాలయాల సిబ్బంది, అధికారులు
- తమ స్మార్ట్ రేషన్ కార్డు ఎక్కడుందో తెలియక లబ్ధిదారుల ఆందోళన
- సచివాలయాలు, రేషన్‌డిపోల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు



ఆరిలోవ : కూటమి ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో స్పష్టత కొరవడింది. తమ కార్డు ఎక్కడుందో తెలియక లబ్ధిదారులు రేషన్ డిపోలు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినప్పటికీ చేతికి కార్డు మాత్రం అందడం లేదు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఆగస్టు 24న ఏఎస్‌వో కార్యాలయాలకు చేరిన స్మార్ట్ కార్డులు సచివాలయాలకు పంపించారు. అదే నెల 27న ఎంపిక చేసిన సచివాలయాల్లో నియోజకవర్గం, వార్డు స్థాయిలో నాయకులు వాటి పంపిణీని గొప్పగా ప్రారంభించారు. ప్రారంభంలో అందరికీ కార్డులు ఇచ్చేస్తామని పిలిపించుకుని కొంతమందికి మాత్రమే అందజేశారు. అనంతరం సచివాలయాల సిబ్బంది మిగిలిన వారికి ఇంటింటికీ వచ్చి ఇస్తారని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. సచివాలయాల సిబ్బంది క్లస్టర్ల వారీగా వాటి పంపిణీకి మ్యాపింగ్ చేశారు. రెండు, మూడు రోజులపాటు సచివాలయాల్లో అందజేశారు. దీంతో సచివాలయాల వద్ద కార్డుదారులు క్యూ కట్టారు. అనంతరం సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి లబ్ధిదారులకు కార్డులు అందజేస్తారని పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రకటించారు. అలా ప్రకటించినప్పటికీ సెప్టెంబర్ ఒకటో తేదీ రావడంతో ఇంటింటికీ వెళ్లి కార్డులు పంపిణీ చేయడానికి సచివాలయ సిబ్బంది విముఖత వ్యక్తం చేశారు. ఒకటో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ ఉంటుందని, దీంతోపాటు తామంతా ఇటీవల బదిలీపై కొత్తగా వచ్చామని, **ఇంటి అడ్రస్‌లు సరిగా తెలియవని వారు తప్పుకున్నారు. ఇంటింటికీ వెళ్లి తాము స్మార్ట్‌కార్డులు అందజేయలేమని ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. వారి విన్నపంతో అధికారులు రేషన్ డిపోలలో కార్డులు అందజేయడానికి సిద్ధం** చేశారు. దీంతో సచివాలయాల వద్ద కార్డుల పంపిణీకి బ్రేక్ పడింది. ఇంటింటికీ సచివాలయాల సిబ్బంది వచ్చి స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తారన్న నాయకుల ప్రకటన కూడా గాలిలో కలిసిపోయింది. గత ప్రభుత్వంలో ఏవైనా కార్డులు, పింఛన్లను వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఇచ్చేవారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పాలకులు ఇంటింటికీ పంపిణీ చేయించలేకపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

సగం మందికి తప్పని ఎదురుచూపులు

విశాఖ తూర్పు నియోజకవర్గంలో 15 వార్డులున్నాయి. **వాటిలో 55కు పైగా రేషన్ డిపోలున్నాయి. ఆయా డిపోలలో సుమారు 70 వేల రేషన్ కార్డులున్నాయి. వాటిలో ఇంతవరకు సుమారు 50 శాతం కార్డులు మాత్రమే లబ్ధిదారులకు అందాయి. మిగిలిన 50 శాతం మంది** కార్డులు తీసుకోకుండా గందరగోళంలో ఉన్నారు. కొంతమందికి ఎక్కడ కార్డులు తీసుకోవాలో ఇంతవరకు స్పష్టత కూడా లేకపోవడం విశేషం. ఇంతవరకు డిపోల డీలర్ల వద్దే స్మార్ట్‌కార్డులు కుప్పలుగా పడి ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ సరకులు ఇస్తున్నప్పటికీ ఎక్కువ మంది వద్ద కార్డులు లేకపోవడంతో సరకులు తీసుకోవడానికి వెళ్లలేదని అంటున్నారు. ప్రస్తుతం కొన్ని డిపోలలో కొత్త స్మార్ట్ కార్డులు అందుబాటులో ఉండగా... మరికొందరు డీలర్లు ఇంకా తీసుకోలేదు. దీంతో లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లాలో..?, డిపోలకు వెళ్లాలో..? తెలియక ఇబ్బంది పడుతున్నారు.

ఎక్కడికెళ్లాలో తెలియక అవస్థలు

పౌర సరఫరాల శాఖ అధికారులు, నాయకుల భిన్న ప్రకటనలు.., ఇంటింటికీ పంపిణీకి సచివాలయ సిబ్బంది విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో కొన్ని రేషన్ డిపోల డీలర్లు తామ పంపిణీ చేస్తామని సచివాలయాల నుంచి స్మార్ట్ కార్డులు తీసుకెళ్లారు. రెండు, మూడు రోజులపాటు డిపోలలో వాటిని లబ్ధిదారులకు అందజేశారు. అయితే మిగిలిన డిపోలలో కూడా కార్డులు ఇస్తున్నారనుకుని లబ్ధిదారులు వెళ్తే... మీ కార్డులు సచివాలయాల్లో ఉన్నాయని, అక్కడే ఇస్తారని డీలర్లు చెబుతుండడంతో కార్డుదారులు అవాక్కవుతున్నారు. వెంటనే కొన్ని సచివాలయాలకు లబ్ధిదారులు వెళ్తే... మీ కార్డులు డిపోలకు పంపించామని, అక్కడకు వెళ్లి తీసుకోమని చెబుతున్నారు. దీంతో ఓ పక్క సచివాలయాలు, మరో పక్క రేషన్ డిపోలకు కాళ్లరిగేలా తిరుగుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తిరిగేందుకు ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు అవస్థలు పడుతున్నారు.

పాత కార్డు తీసుకెళ్లాల్సిందే

కొత్త స్మార్ట్ రేషన్ కార్డు కోసం పాత రేషన్ కార్డు/రైస్ కార్డు తీసుకెళ్లాలి. అక్కడ పాత కార్డు రేషన్ డీలర్‌కు అప్పగించి ఈకేవైసీ కోసం తంబ్ వేస్తే కొత్త స్మార్ట్‌కార్డు ఇస్తున్నారు. పాత కార్డులు తీసుకెళ్లని వారికి కొత్త కార్డులు ఇవ్వడం లేదు. ఆ విషయం తెలియక పాత కార్డు తీసుకెళ్లడం లేదని... డీలర్లు పాత కార్డు అడగడంతో మొర్రోమంటూ ఇంటికి తిరిగొచ్చి మళ్లీ డిపో వద్దకు వెళ్లి క్యూలో వెనుక నిల్చోవాల్సి వస్తోందని.. కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె ఇళ్లలో ఉన్నవారు... స్వగ్రామం వెళ్లాల్సిందే...

అద్దె ఇళ్లల్లో ఉన్నవారికి కొత్త కార్డులు తీసుకునేందుకు మరో రకమైన తిప్పలు వచ్చిపడ్డాయి. ఇళ్లు మారినవారు అందుబాటులో ఉన్న రేషన్ డిపోలలో సరకులు తీసుకునేవారు. స్మార్ట్ కార్డుకు కూడా అలాంటి వారు అదే డిపోకు వెళ్తే... మీ కార్డు ఇక్కడకు రాలేదని, సచివాలయానికి వెళ్లాలని డీలర్లు చెబుతున్నారు. దీంతో ఏ సచివాలయానికి వెళ్లాలో తెలియక అందుబాటులో ఉన్న సచివాలయాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ, ఇసుకతోట, వెంకోజీపాలెం, పెదవాల్తేరు, చినవాల్తేరు, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, హనుమంతవాక, శివాజీపాలెం ప్రాంతాల్లో అద్దె ఇళ్లల్లో వేల మంది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వారు నివసిస్తున్నారు. వారి స్మార్ట్ కార్డులు స్వగ్రామాల్లో ఉన్నప్పటికీ సరకులు మాత్రం ప్రస్తుతం ఉంటున్న ప్రాంతాలకు సమీపంలోని డిపోల్లోనే తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వారంతా స్మార్ట్ కార్డులను స్వగ్రామంలో ఉన్న డిపోలలో తీసుకోవాల్సిందే. దీంతో వారంతా ఇప్పుడు పనులు మానుకుని స్వగ్రామలకు వెళ్లాల్సి వస్తోంది. ఒక్కరోజు కూలి లేకపోయినా ఇళ్లు గడవని పరిస్థితిలో కార్డుల కోసం వెళ్లాల్సి రావడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ – సేవ కేంద్రాలు, నెట్ సెంటర్లలో స్మార్ట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తే బాగుంటుదని కార్డుదారులు భావిస్తున్నారు. అధికారులు ఆ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్నీ మోసాలే



వివేకానందనగర్‌లో వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ 18వ వార్డు అధ్యక్షుడు కల్యాణ్, నాయకులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో నాయకులు 10, 12వ నంబర్ బూత్‌ల పరిధిలోని 40 గజాల కాలనీలో ఇళ్లు, కిరాణా షాపుల వద్దకు వెళ్లి చంద్రబాబు ప్రభుత్వ మోసాలపై కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వంలో అన్నీ మోసాలే జరుగుతున్నాయని ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఎక్కువ హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని, అవసరమైన సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంకర బాబూరావు, కాకర గోవింద్, సురేష్, భాగ్యరాజ్, నాయుడు, పాండ్రింకి బంగార్రాజు, బమ్మిడి రామారావు పాల్గొన్నారు.

వార్డులోని సమస్యలకే దిక్కు లేదు

జీవీఎంసీ పదో వార్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వివేకానందనగర్‌లోని 77వ నంబరు బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి పాలకులు వార్డులో ఉన్న సమస్యలను సైతం పరిష్కరించలేకపోతున్నారని విమర్శించారు. వార్డులోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొందని, రోడ్లు, కాలువలు శిథిలమయ్యాయని... వాటిని కూడా నిర్మించలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాస్, నాయకులు వెంకటలక్ష్మి, తులసి, రవీంద్ర, కన్నబాబు, అబ్దుల్ రావూఫ్, ఆనంద్, భగత్‌రావు, నాయుడు, హరిబాబు, రమణ, శ్రీదేవి, గోవిందమ్మ, మంతాజ్ పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు

ఎంవీపీ కాలనీ : సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ ఆధ్వర్యంలో బూత్ నంబర్ 94లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మిడి కల్యాణ్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కారన్నారు. ఏడాదిన్నర పాలనలో రాష్ట్రంలో అక్రమ అరెస్టులు, హత్యలు, అరాచకాలు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు మినహా చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కూటమి నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయ చందర్, మహిళ విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి, విశాఖ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, మూలపాలెం సొసైటీ అధ్యక్షుడు మారుపల్లి పరదేశి, 19వ వార్డు నాయకుడు దాసు తదితరులు పాల్గొన్నారు.



పదమూడో వార్డులో కిరాణా షాపు యజమానికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యతోనే వికసిత్ భారత్ సాకారం



విద్యార్థినికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : వికసిత్ భారత్ సాకారంలో విద్య కీలకంగా నిలుస్తుందని ఐఐటీ అగర్తల పూర్వ సంచాలకులు ఆచార్య పి.ఎస్.అవధాని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ప్రమోటింగ్ లిటరసీ ఇన్ ద డిజిటల్ ఎరా అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం – 2025 సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ ఏఐ సాంకేతికతతో అనేక సమస్యలకు పరిష్కారాలు పొందడం సాధ్యపడుతుందన్నారు. అదే సమయంలో మానవునిలో సృజనాత్మక శక్తి లోపిస్తోందని చెప్పారు. నూతన సాంకేతికతల వినియోగం ఫలితంగా పర్యావరణం దెబ్బతింటున్న విధానాన్ని వివరించారు. యువతే భవిష్యత్‌లో భారత్‌కు మూల స్తంభాలుగా నిలవాలని సూచించారు. ఇందుకోసం నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమన్నారు. ప్రపంచం నేడు డిజిటల్ అక్షరాస్యత దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత పనిచేస్తున్నప్పటికీ పుస్తకం ప్రాధాన్యత తగ్గకూడదని, నూతన సాంకేతికతలు పుస్తకానికి ప్రత్యామ్నాయం కాబోవన్నారు. నూతన డిజిటల్ సాంకేతికతలు విద్యార్థుల ఏకాగ్రతను కొంతవరకు దెబ్బతీస్తున్నాయన్నారు. అనంతరం వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బాలుడి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ : వాసవానిపాలెంకు చెందిన చొక్కా యశ్వంత్ అనే బాలుడి అనుమానాస్పద మృతిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చొక్కా పెద్దిమ్మ, చొక్కా అప్పన్నకు ఇద్దరు కుమారులు యశ్వంత్, దనుష్ సంతానం. వీరంతా వాసవానిపాలెంలో నివసిస్తున్నారు. ఈ నెల 7న రాత్రి 9.30 సమయంలో తల్లి పెద్దిమ్మ కుమారులకు భోజనం పెట్టగా ఇద్దరూ తిన్నారు. కొద్దిసేపు ఆడుకున్న తర్వాత తండ్రి అప్పన్న 11.30 సమయంలో ఇంటికి వచ్చే సరికి కుమారులిద్దరూ వాంతులు చేసుకుంటున్నారు. దీంతో వెంటనే వారిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పెద్ద కుమారుడు యశ్వంత్ (7) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు 8న కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ యశ్వంత్ మరణించాడు. దీంతో అతని మరణానికి గల కారణాలు తెలుసుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి స్క్రీనింగ్ పరీక్షలు

మహారాణిపేట : ప్రజలందరికీ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ సెమినార్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్ కేసులను గుర్తిస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ హారిక పాల్గొన్నారు.

5కే రన్ విజేతలకు బహుమతులు



విజేతలతో కలెక్టర్ హరేందిర ప్రసాద్, తదితరులు

మహారాణిపేట : 5కే రన్‌లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను జిల్లా అధికారులు అందించారు. విజేతలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం తన కార్యాలయంలో బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి విజేతలను త్వరలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ ఖర్చులతో పంపుతామని తెలిపారు. అదే విధంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీల విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందచేశారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నేత్ర దాన ఆవశ్యకత, వాటిపై ఉన్న అపోహలు తొలగేలా 15 రోజుల పాటు నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వద్ద కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించినట్టు డాక్టర్ మీనాక్షి తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జ్యోతిర్మయి, నవీన్‌కుమార్, శ్రీలక్ష్మి, ఐ బ్యాంక్ మేనేజర్ అభినీత్, నేత్ర వైద్యశాల సిబ్బంది, ఏఎంసీ విద్యార్థులు, మొహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నీ వదిలేసి.. ఒక్క బడ్డీపైనే చర్యలేలా..?

- జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేశాడని కక్ష సాధించారనే ఆరోపణలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ సర్కిల్‌లో ఫుట్‌పాత్‌ను ఆనుకుని ఉన్న ఒక బడ్డీపై జోన్ – 3 టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవడం విమర్శలకు తావిచ్చింది. కూడలి చుట్టూ ఫుట్‌పాత్‌ను ఆనుకుని భారీగా బడ్డీలున్నాయి. దీంతో ఆయా బడ్డీలు అన్నింటిపైనా చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అందుకు భిన్నంగా గత పదేళ్లుగా ఉంటున్న ఒక బడ్డీని పగలగొట్టి వెళ్లిపోయారు. అయితే ఆ చుట్టుపక్కల ఎన్నో అనధికారిక బడ్డీలు ఉన్నప్పటికీ ఆ ఒక్క బడ్డీపైనే చర్యలు తీసుకోవడంలో అంతర్యమేంటనే చర్చ నడుస్తోంది. సోమవారం మధ్యాహ్నం టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడికి చేరుకుని ముందస్తు సమాచారం ఇవ్వకుండానే బడ్డీని పగలగొట్టారు. అయితే టౌన్‌ప్లానింగ్ జోన్ – 3 విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులు పలు నిర్మాణాల విషయంలో నిబంధనలు పాటించడం లేదంటూ ఆ బడ్డీ యజమాని జీవీఎంసీ ఉన్నతాధికారులకు పలు సందర్భాల్లో ఫిర్యాదు చేయడంతో కక్షసాధింపు చర్యకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానిక టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు అక్తర్, సాయిరామ్ వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు. దీంతో ఫోన్‌లో జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదన్‌రావు వివరణ కోరగా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బడ్డీలపై చాలా చోట్ల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఎంవీపీ సర్కిల్‌లో ఫుట్‌పాత్‌పై ఉన్న ఒక్క బడ్డీ మాత్రమే తొలగించి... మిగతావి వదిలేసిన అంశం తన దృష్టికి రాలేదన్నారు. స్థానిక సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలియజేస్తానన్నారు.

ఐడియా వెబ్‌సైట్ ఆవిష్కరణ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పరిపాలన శాస్త్రం విభాగంలో సోమవారం ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ ఎంగేజ్మెంట్ అండ్ ఎకౌంటబుల్టి (ఐడియా) ఫౌండేషన్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ఈ వెబ్‌సైట్ ప్రభుత్వ పాలన, పారదర్శకతకు జవాబుదారీతనంగా నిలవడంతో పాటు అవినీతిని తగ్గిస్తుందన్నారు. ఐడియా ఫౌండేషన్‌ను అభినందించారు. అతిథులు టి.అనిల్‌కుమార్, విజయ్ కుమార్ సాహు, పైడి రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సమానత్వం సాధించాలని సూచించారు. విభాగ అధిపతి ప్రేమానందం మాట్లాడుతూ ఐడియా ఫౌండేషన్ ద్వారా పరిశోధనలు జరపాలన్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి విద్య కీలకం



ఆచార్య ఆదినారాయణ రెడ్డితో విద్యా విభాగం ప్రతినిధులు

మద్దిలపాలెం : సమాజ అభ్యున్నతికి విద్య మార్గం చూపుతుందని కుప్పంలోని ద్రవిడియన్ యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.ఆదినారాయణ రెడ్డి అన్నారు. ఏయూ విద్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తి ప్రగతికి, సమాజ అభ్యున్నతికి విద్య కీలకంగా నిలుస్తుందని చెప్పారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ విద్యావంతుల శక్తే దేశానికి బలమన్నారు. వేద కాలం నుంచి జ్ఞాన కేంద్రంగా భారతదేశం విరాజిల్లుతోందని గుర్తు చేశారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలని సూచించారు. విద్యతో ప్రపంచ శాంతిని సాధించవచ్చని, సుస్థిర ప్రగతికి అక్షరాస్యత దోహదపడుతుందన్నారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు వజీర్ మహమ్మద్, జాతీయ పురస్కార గ్రహీత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నేటి తరాన్ని తీర్చిదిద్దడం, విలువైన మానవ వనరులుగా తయారుచేసి సమాజానికి అందించడం ఎంతో అవసరమన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ మోహన్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఫిజియోథెరపీ దినోత్సవం



ఫిజియోథెరపిస్ట్ ప్రియాంకను సత్కరిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఎంవీపీ కాలనీ : లాసన్స్ బే కాలనీలోని హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగుల పాఠశాలలో వరల్డ్ ఫిజియోథెరపీ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ప్రియాంకను స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక వికాసం, భౌతిక పురోగతికి ప్రియాంక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాల డైరెక్టర్ మధు పాల్గొన్నారు.